# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 25-06-2025                    సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రకు పయనమయ్యారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమయ్యింది.
- ❖ దేశంలో 1975 జూన్ 25న విధించిన అత్యవసర పరిస్థితిని నూతన తరం అర్థం చేసుకునేందుకు ఈ రోజును సంవిధాన్ హత్య దివస్‌గా ప్రకటించామని హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 123వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

====================

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రకు పయనమయ్యారు. నలుగురు వ్యోమగాముల బృందానికి ఆయన కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. దేశం మొత్తం శుభాంశు శుక్లా ని చూసి గర్వ పడుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. నాసా, ఇస్రో మధ్య శాశ్వత భాగస్వామ్యాన్ని ప్రతిబింబించే ఈ మిషన్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. అక్కడ వ్యోమగాములు చేసే విస్తృత ప్రయోగాలు శాస్త్రీయ అధ్యయనాలు, అంతరిక్ష యాత్రలకు ఈ మిషన్ దిక్సూచిగా మారనుందని పేర్కొన్నారు. ఈ మిషన్ విజయవంతం కావడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యోమగాములకు అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్రలో నిలిచారన్నారు. 140 కోట్లమంది భారతీయుల కలలు, ఆకాంక్షలను ఆయన మోసుకెళ్లారని సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు.

====================

ప్రస్తుతం ఈ వ్యోమనౌక భూకక్ష్యలోకి ప్రవేశించి అక్కడ ప్రయాణిస్తోంది. యాక్సియం-4 మిషన్ లో బాగంగా వ్యోమనౌక రేపు సాయంత్రం 4 గంటల 30 నిమిషాలకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ISS)తో డాకింగ్ అవుతుందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో తెలిపింది. స్పేస్ఎక్స్ డ్రాగన్ ISSతో డాక్ అయిన తర్వాత,

వ్యోమగాములు దాదాపు రెండు వారాలు అంతరిక్ష కేంద్రంలో గడుపుతారని వెల్లడించింది. అక్కడ వారు మైక్రోగ్రావిటీ పరిశోధన, సాంకేతిక ప్రదర్శనలను నిర్వహిస్తారు. వ్యోమగాములు 31 దేశాల నుండి దాదాపు 60 శాస్త్రీయ అధ్యయనాలను చేపట్టనున్నారని వీటిలో ఇస్రో నేతృత్వంలోని అనేక పరిశోధన ప్రాజెక్టులు కూడా ఉన్నాయని ఇస్రో వెల్లడించారు.

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమయ్యింది. ఈ సమావేశంలో దేశ అత్యవసర పరిస్తితి సమయంలో రాజ్యాంగ పరిరక్షణకు ప్రాణాలను అర్పించిన వారికి నివాళులర్పించారు. అనంతరం కేబినెట్ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో అంతర్జాతీయ బంగాళాదుంప కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఝరియా కోల్‌ఫీల్డ్‌లో అగ్నిప్రమాదం బాధిత కుటుంబాల పునరావాసం కోసం సవరించిన ఝరియా మాస్టర్ ప్లాన్‌కు సైతం కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. అదే విధంగా పూణే మెట్రో రైలు ఫేజ్ 2 కు మంత్రి మండలి అంగీకారం తెలిపిండని అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

====================

దేశంలో 1975 జూన్ 25న విధించిన అత్యవసర పరిస్థితిని కొత్త తరం అర్థం చేసుకునేలా కేంద్రప్రభుత్వం ఈ రోజును "సంవిధాన్ హత్య దివస్"గా ప్రకటించిందని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు సంవిధాన్ హత్య దివస్ సందర్భంగా "లాంగ్ లివ్ డెమోక్రసీ యాత్ర"ను ఈరోజు న్యూ ఢిల్లీలో ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ... అత్యవసర పరిస్థితి సమయంలో, పత్రికా స్వేచ్ఛను అణచివేయడం, న్యాయవ్యవస్థ చేతులు కట్టివేయడం, సామాజిక కార్యకర్తలను జైలులో పెట్టడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయణీ వెల్లడించారు. అధికారం నియంతృత్వంగా మారినప్పుడు, దానిని పెకిలించే శక్తి ప్రజలకు ఉందని ఈ రోజు అందరికీ గుర్తు చేస్తుందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

అదే విధగా 'ది ఎమర్జెన్సీ డైరీస్-ఇయర్స్ దట్ ఫోర్జ్డ్ ఎ లీడర్' అనే పుస్తకాన్ని కూడా అమిత్ షా ఈరోజు విడుదల చేశారు. ఈ పుస్తకం అప్పటి ఆర్ఎస్ఎస్ యువ ప్రచారక్, అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా చేసిన పోరాటంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాత్రను లోతుగా పరిశీలిస్తుంది. ఈ పుస్తకం అత్యవసర పరిస్థితి సమయంలో తన ప్రయాణాన్ని వివరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితి వ్యతిరేక ఉద్యమం తనకు ఒక అభ్యాస అనుభవంగా నిలిచిందని గుర్తు చేసుకున్నారు.

విరామం

====================

పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్తుతల దృష్ట్యా ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల్లో ఉన్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సింధు' కొనసాగుతోంది. ఇప్పటి వరకు ఇరాన్ నుంచి 2,858 మందిని, ఇజ్రాయెల్ నుంచి 818 మందిని ప్రభుత్వం స్వదేశానికి తీసుకొచ్చింది. ఇరు దేశాల నుంచి వచ్చిన వారిలో 71 మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారున్నారు. ఢిల్లీ నుంచి వారిని స్వస్థలాలకు పంపామని ఆంధ్రప్రదేశ్ భవన్ అధికారులు తెలిపారు. గత ఆరు రోజుల్లో వచ్చిన 71 మందిలో 28 మంది ఢిల్లీ విమానాశ్రయం నుంచి స్వస్థలాలకు వెళ్లారని, ఏడుగురు టీసీఎస్ ఉద్యోగులను ఆ సంస్థ అధికారులు తీసుకెళ్లారని వెల్లడించింది.

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈ నెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

====================

దేశ ఎగుమతులను పెంచడానికి కీలక రంగాలలో స్వావలంబన అవసరమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ స్పష్టం చేశారు. ఈ రోజు న్యూడిల్లీలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకంపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇతర దేశాల కంటే పోటీతత్వాన్ని కలిగి ఉన్న రంగాలపై భారత్ దృష్టి పెట్టాలన్నారు. పరిమాణానికి బదులుగా నైపుణ్యం కలిగిన మానవశక్తిని సృష్టించడంపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ద్వారా లక్షా 76 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని, 12 లక్షల ఉపాధి అవకాశాలు లభించాయని పియూష్ గోయల్ పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

====================

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (CBSE) కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే సంవత్సరం నుంచి రెండుసార్లు పదవ తరగతి పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఏడాదిలో రెండుసార్లు పదో తరగతి పరీక్షల నిర్వహణకు బోర్డు ఆమోదం తెలిపింది. బోర్డు నిర్ణయంతో సీబీఎస్ఈ విధానంలో 10వ తరగతి చదివే విద్యార్థులు వచ్చే 2026 నుంచి బోర్డు పరీక్షలను సంవత్సరంలో రెండు సార్లు రాయాల్సి ఉంటుంది.

====================

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలను 3 నెలల్లోగా నిర్వహించాలని ఆ రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే ప్రక్రియను వచ్చే సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేసి ఫలితాలను ప్రకటించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవి దేవి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ఆ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేశారు. స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల (BC) రిజర్వేషన్లను ఖరారు చేసి ప్రకటించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి 30 రోజుల గడువుతో ప్రారంభించి, మొత్తం ఎన్నికల ప్రక్రియకు న్యాయస్థానం మూడు నెలల కాలపరిమితిని నిర్ణయించింది.

====================

ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా చెక్ రిపబ్లిక్‌లో జరిగిన ఆస్ట్రావా గోల్డెన్ స్పైక్ 2025 మీట్‌లో జావెలిన్ త్రో టైటిల్‌ను గెలుచుకున్నాడు. నిన్న రాత్రి జరిగిన ఫైన్ లో పోటీలో 85.29 మీటర్ల అత్యుత్తమ త్రో విసిరి నీరజ్ చోప్రా టైటిల్‌ను కైవసం చుకున్నాడు.

====================

====================